
**కోడలుగా అడుగు పెట్టినప్పటినుంచీ, అత్తగారయ్యేదాకా ఆమె సందుకాపెట్టె సహాయంతోనే సంసారాన్ని వొడ్డెక్కించింది. ఏమిటా సందుకాపెట్టె రహస్యం?**

ట్రిక్. టక్. టక్. టక్. టక్. టక్.

తలుపు చప్పుడు. ఆ చప్పుడికి ఉలిక్కిపడింది సుమిత్ర. ఎదురుగా వున్న చెక్క టేబుల్ వంక చూసింది. చిన్న అలారం టైంపీస్ పావుతక్కువ అయిదు చూపించుతోంది.

# సందుకాపెట్టె ........ ఇ.వి.యస్. అచ్యుతవల్లి




ఇంక పటాలం అంతా వచ్చేసే వేళయింది అనుకుంది. పటాలం అంటే ఎంతమందో కాదు. భర్త, ఇద్దరు కూతుళ్ళూ, ఒక్క కొడుకూను. ముచ్చటగా ముగ్గురు సంతానంతోనే ఆపేసింది సుమిత్ర- అత్తగారు చెప్పే పాపపుణ్యాల జమాఖర్చులేవీ వినకుండానే. సుమిత్ర తన చిన్నప్పుడు ఆటలాడుకునే సందుకాపెట్టె తెచ్చుకుంది కాపరానికి వచ్చేప్పుడు.

ఆ సందుకా పెట్టెలో చిన్నప్పుడు తనగాజులు, పూసలు, రిబ్బన్లు పెట్టుకునేది. ఇంకా చిన్నప్పుడు చిన్న చిన్న పింగాణీ బొమ్మలు ఆడుకునేవి పెట్టుకునేది. అత్తవారింటికి వచ్చేప్పుడు ఆ సందుకాపెట్టె తెచ్చుకుని తన గదిలో తన పెద్ద ట్రంక్ పెట్టె వెనకాతల పెట్టింది. భర్త- అదే అప్పుడు కొత్త పెళ్ళికొడుకు నవ్వాడు. అతని పేరు శివరావు. అందరూ శివుడూ, శివా అని పిలుస్తారు.

"అదేమిటి ఆ బుల్లి పెట్టె!" అన్నాడు.

"ఆ పెట్టె అంటే నాకు చాలా ఇష్టం. మా అక్కయ్యలు పట్టుకుపోతానంటే వాళ్ళతో దెబ్బలాడి నాకు పుణ్ణిచ్చు కున్నాను."

"దాన్నిండా బంగారం కాసులు పోసుకుంటావా! నీ పిచ్చికాని ఎందుకా పెట్టె" అన్నాడు, తొలిప్రేమలోని ఆత్మీయత కలిపి

"ఏమిటో నాకు ఆ పెట్టె ఎందుకో ఒకందుకు ఉపయోగించుకోవాలనిపిస్తుంది. మా బామ్మ చిన్నప్పుడు ధాన్యం అమ్మి బంగారం కాసులుకొని ఆ పెట్టెలో దాచుకునేదట. దానికో బుల్లి తాళం కూడా వున్నది. చూడండి" తాళంతీసిచూపెట్టింది. దాన్నిండా పూలువుండలు. సిల్కుదారాలు. రంగు వెలిసిన గాజులు, జడకుచ్చులు. రిబ్బన్లు. చిన్న కాలు విరిగిన పింగాణీ దొరసాని బొమ్మ.

"మీ బామ్మ బంగారం దాచినదాంట్లో ఈ పనికిమాలిన చెత్తంతా దాస్తున్నావా! బంగారం మోసిన పెట్టెకి మామూలు గాజులూ, పూసలూ మోయటం అవమానం కాదా!" అన్నాడు నవ్వుతూనే.

"మరి ఏం పెట్టుకోను అందులో!" అంది ఆలోచనగా.

"నీ డబ్బులు ఏమున్నా పెట్టుకో!" అన్నాడు. అలా అన్నాడు కానీ, శివరావుకి అవేమీ జ్ఞాపకం లేనే లేవు. ఇప్పుడు సుమిత్ర మటుకు భర్త ఆజ్ఞని శిరసావహించింది. ఇప్పుడు అసలు సుమిత్రకు డబ్బులు దాచే అలవాటులేదు. చిన్నప్పుడు యేమన్న కావాలంటే వాళ్ళ నాన్నగారినో, అమ్మగారినో అడిగి కొనిపించుకునేది. పెళ్ళయినాక భర్తని అడగవచ్చును అనుకుంది. శివరావుకూడా కొత్తలో ఆవిడ ఏదయినా కొనమంటే వెంటనే కొనకపోయినా ఒకటి రెండు రోజుల్లో జ్ఞాపకం పెట్టుకుని కొనేసేవాడు. సుమిత్ర అయినా కారు కొనమనీ, రవ్వల నెక్లెస్ కొనమనీ అడిగేదికాదు. నీలంరంగు గాజులో లేకపోతే మరువం కలిసిన కదంబం ముక్కో అడిగేది. అంతకుమించి అడగని భార్య సుశిక్షిత జ్ఞానానికి శివుడు మనస్సులో మెచ్చుకొనేవాడు. తొలిసారీ, మలిసారీ, పుట్టింటికి పురుడు పోసుకుందుకు వెళ్ళేప్పుడు యాభయి రూపాయలు ఇచ్చి పంపే భర్త, సుమి

# విశాఖలో కథాసంపుటి ఆవిష్కరణ

ఫిబ్రవరి 14వతేదీనాడు విశాఖపట్నంలో విశాఖరచయితల సంఘం ఆధ్వర్యాన జరిగిన "హేట్స్ ఆఫ్ టు కాంతం" గరిమెళ్ళ వెంకటసీతారాం కథలు ఆవిష్కరణ సభలో సభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీ ఆవుల సాంబశివరావు మాట్లాడుతూ కథా సాహిత్యం వచ్చిన తర్వాతే సాహిత్యం ప్రజలకు మరింత సన్నిహితమయిందని, చిన్న కథలు ఒక్కొక్కటి ఒక్కొక్క చిరుదీపంలా కాంతులు వెదజల్లుతున్నాయని, చిన్న కథలు ప్రజల హృదయాలకు హత్తుకుంటున్నాయని చెప్పేరు.

డాక్టర్ పురిపండా అప్పలస్వామి తన ప్రారంభ ఉపన్యాసంలో చిన్న కథ ఇక్కడే పుట్టి ఇక్కడే వికసించి నేటికి పరిమళాలు వెదజల్లుతోందని, మనమంతా కథానిక, చిన్నకథ అంటాంగానీ, 'తిత్తవ' అంటేనే అట్టడుగు గ్రామీణ ప్రజలకు అర్ధమవుతుందని, 1903లోఆచంటసాంఖ్యాయనశర్మ ఈ గడ్డమీదనే చిన్న కథకు శ్రీకారం చుట్టారని, గురజాడ తన అసమాన ప్రతిభతో దాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళారని చెప్తూ, గరిమెళ్ళ వెంకట సీతారాం చాలా మంచి కథలు రాసినందుకు గరిమెళ్ళను అభినందించారు.

కథా సంపుటని ఆవిష్కరిస్తూ ప్రఖ్యాత రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి "కథలు రాయటం చాలా కష్టమైన పని. కథలురాస్తే జీవితం మీద కామెంట్ చేయాల్సి వుంటుంది. అంచేత మనకి మనం మంచేమిటో, చెడ్డేమిటో తెల్సుకున్నామా అని తర్కించుకొన్నాకే కథలు రాయాల"ని చెప్పేరు.

"నవలల్నీ, కథల్నీ ప్రజలు ఒకే రకంగా అభిమానిస్తున్నా, ప్రచురణకర్తలు డబ్బు చేసుకోవడంకోసం నవలలకు ప్రాధాన్యం యిస్తున్నారని. ఈ వ్యాపార నాగరికత వలన పది కాలాల పాటు వుండాల్సిన కథలు అట్టడుగున పడిపోతున్నాయని" రచయిత కాళీపట్నం రామారావు చెప్పారు. "కథా సంపుటాలు నోచుకోని ఈ సమయంలో ఒక్క విశాఖపట్నంనుంచే ఐదు కథా సంపుటాలు ఈ ఏడాదిలో వచ్చాయని, యిది విశాఖ రచయితలకు గర్వకారణమని" చెప్పారు.

కథలపట్ల పాఠకులకు అభిమానం ఉన్నప్పటికీ ప్రచురణకర్తలు నవలల పట్ల ఎక్కువ మోజు చూపుతూ కథలకు ప్రోత్సాహం ఇవ్వడంలేదని రచయిత్రి నందుల సుశీలాదేవి విచారం వ్యక్తపరిచారు.

ప్రఖ్యాత రచయిత శ్రీవాకాటి పాండురంగారావు మాట్లాడుతూ, గరిమెళ్ళ వెంకట సీతారాం మంచి మనిషి అని, అందుచేతనే చాలా మంచి కథలు రాయగలిగేడని, ఈ సంపుటిలో ప్రచురించిన రెండు మూడు కథలు సినీమా తీయడానికి అర్హత పొంది ఉన్నాయని చెప్పారు.

సంస్కరణలవల్ల సమాజంలో మార్పు వస్తుందని గరిమెళ్ళ వెంకట సీతారాం నమ్మినట్లు కథల్లో స్పష్టమౌతుంది. సంస్కరణల వలన మరమ్మత్తు చేయడం సాధ్యం అవుతుందే తప్ప సమాజాన్ని సమూలంగా మార్చడం అసాధ్యం అని శ్రీ చలసాని ప్రసాద్ చెప్పారు. కథా సంపుటిలోని కథలను నాలుగు భాగాలుగా విభజించి, సద్విమర్శ చేస్తూ రచయిత గరిమెళ్ళ వెంకట సీతారాం కథలలో కథా వస్తువును, శిల్పాన్ని కొనియాడారు.

మార్పు కావాలంటూ రచయిత చెప్పేది చేరాల్సిన చోటికి చేరడంలేదనీ, వివిధ మార్గాల్లో పయనంమాని రచయితలంతా ఉమ్మడిగా ఉద్యమిస్తే సత్ఫలితాలుంటాయని సినీ దర్శకుడు ధవళ సత్యం చెప్పారు. రచనలు ప్రజలను ఉత్తేజపరిచేవిగా వుండాలని నిర్మాత డూండీ చెప్పారు.

ఈ సభ యింత రసవత్తరంగా నడపడంలో పాలు పంచుకొన్న వారందరికీ రచయిత గరిమెళ్ళ వెంకట సీతారాం కృతజ్ఞత తెలుపుకొంటూ, తను సామాజిక స్పృహతోను, సాంఘిక ప్రయోజనంతో కూడుకొని శాశ్వతమైన మంచి విలువలను ప్రబోధించే, నాలుగు కాలాలు నిలిచే కథలు రాయడానికి ప్రయత్నిస్తున్నానని చెప్పారు.

ఈ సభకు స్వాగతం డాక్టర్ తంబు, వందన సమర్పణ డాక్టర్ చందు సుబ్బారావు. ●

త్రకు అపురూప వరంగా కనపడేవాడు. మూడోసారి కానుపుకి కష్టమయి హాస్పిటల్‌లో జాయిన్ అవవలసి వచ్చింది. దానితో తన చేతులకున్న ఒకే ఒక బంగారు గాజుల జత అమ్ముకోవాల్సి వచ్చింది. మగపిల్లవాడు కలిగాడన్న తృప్తి మిగిలింది ఆ చిన్న దంపతులకి. సీతా, గీతా, బాజీ ముగ్గురూ బాగానే పెరుగుతున్నారు. తల్లి చనిపోయినా ముగ్గురు పిల్లల అవసరాలు పెరగటంతో శివరావుకి ఒక మనిషి పోషణ భారం తప్పిందన్న నిశ్చింత మిగలలేదు. సీతకు ఏడేళ్ళున్నాయి, గీతకు అయిదు. బాజీకి మూడు సంవత్సరాలు వచ్చేయి. ఇంక ఈ సంవత్సరం నించి సుమిత్రకు ఏమన్నా దాచుకోవాలన్న కోరిక పుట్టింది. అడపాతడపా భర్త జేబులో మిగిలిన చిల్లరడబ్బులుతీసి సందుకాపెట్టెలో వేసి దాస్తూండేది. అవి అన్నీ వారానికీ, పదిరోజులకీ పిల్లలూ, భర్తా లేనప్పుడు తీసి లెఖ్ఖపెట్టుకుంటూ వుండేది. పావలాలు, అర్ధరూపాయిలూ, పదిపైసల బిళ్ళలూ— గల గలల్లాడుతూ ఒకచోట కన్పించగానే తనొక పెద్ద నిధి పోగుజేసినట్టు గర్వం కలిగేది. పిల్లలు చూస్తే డబ్బులిమ్మంటారేమో అని భయం! భర్తకు తెలిస్తే ఇంతగా తను ప్రేమగా చూస్తున్నా వేరేగా డబ్బులు దాచుకుంటుందేమో అని బాధపడతాడనే బెంగ! సుమిత్రను వేధించుతూ వుండేవి. అయినా సుమిత్రకు డబ్బులు దాచుకుందామనే యావ ఎదురింటి సావిత్రివల్ల కలిగింది. సావిత్రి ఎప్పుడూ మంచి మంచి చీరలు కొనేది. పిల్లలికి కాళ్ళకు వెండిగజ్జలూ, మువ్వలూ చేయించింది. సావిత్రి భర్త శివరావు లాగా చిరుద్యోగే! వాళ్ళకి మడిమాన్యాలేమీ లేవు తాత ముత్తాతలు ఇచ్చినవి.

"ఎలా చేయించారండీ" అంది ఆశ్చర్యంగా సుమిత్ర.

"నేను దాచుకున్న డబ్బుతో చేయించాను" అంది గర్వంగా సావిత్రి. వెంటనే పెళ్ళయిన కొత్తలో భర్తే డబ్బులు ఏమన్నా దాచుకో అన్న మాటలు గుర్తుకు వచ్చేయి. సావిత్రిలా వెండి గజ్జెలూ మువ్వలూ చేయించలేకపోయినా సీతకూ, గీతకూ మంచి బట్టలేమయినా కుట్టించవచ్చును అనుకుంది. అప్పట్నించీ తనూ దాచటం మొదలు పెట్టింది. ఒకసారి ముప్ఫయి రూపాయలు పోగయినాయి. సుమిత్రకు చాలా సంతోషం కలిగింది. ఇంకొక్క యిరవయి రూపాయిలు పోగుచేసి పట్టుగుడ్డ కొనాలనుకుంది. రెండు మీటర్లు పట్టు

గుడ్డ తీసుకుని దానికి అంచుకొని వేయించి రెండు ఫిల్ట్స్ వేయించి పరికిణీ కుట్టించితే సీతకూ, అదిపొడుగయిపోతే గీతకూ కట్టవచ్చును. సావిత్రి పిల్లల్లా తన పిల్లలూ "మా అమ్మ యివి చేయించింది. మా అమ్మ అవి కొంది." అని చెప్పుకుంటారు అనుకుని మురిసిపోయింది. అనుకోకుండా ఆ నెలలో సుమిత్ర అన్నగారు వచ్చేడు. రెండురోజులుండి వెళ్ళేప్పుడు పిల్లలకి ఏమన్నా కొనుక్కోవే అంటూ ఇవయిరూపాయలిచ్చి వెళ్లేడు. తను టార్గెట్ ఇంత స్వల్ప వ్యవధిలో చేరుతుందని ఆశించలేదు. బ్రహ్మానందపడిపోయింది సుమిత్ర. ఒకరోజు తీరుబడి చేసుకుని బజారుకు బయలుదేరుదామనుకుంది పిల్లల్ని స్కూలుకి పంపి. బాజీని పక్కవాటావాళ్ళకి అప్పగించి ఇంటి వీధి గుమ్మంతలుపు గొళ్ళెం పెడుతూంటే నవ్వుతూ రిక్షా దిగిందిఆడపడుచు. ఇద్దరు పిల్లలతో. ఆవిడ నాలుగయిదు సంవత్సరాలకికాని అన్నగారింటికిరాదు తల్లిపోయినాక ఆవిడ రావటం ఇదే మొదటిసారి. ఆడపడుచు నెల రోజుల మకాంలో చాలాసార్లు సుమిత్ర సందుకాపెట్టె తెరవాల్సివచ్చింది. ఆడపడుచు వెళ్ళినాక సందుకా పెట్టె తెరిచి చూసుకుంటే నాలుగు అర్ధ రూపాయ కాసులు. ఏడు పదిపైసల బిళ్ళలు, మూడు పావలా కాసులూ వున్నాయి. అయినా సుమిత్ర బాధపడలేదు. వెళ్ళేప్పుడు సుమిత్ర ఆడబిడ్డ ఇరుగుపొరుగూతో "మా అన్నయ్యా, వదినా మాఅమ్మని మరిపించేరు. తల్లి కంటె బాగా ఆదరించింది మా వదిన," అని చెప్పుకుని మురిసి వెళ్ళింది. ఆమె సంతోషమే తమ కుటుంబానికి రక్ష అనుకుంది సుమిత్ర. మళ్ళీ పోగుచేయడం ప్రారంభించింది. ఇప్పుడు లెక్క చూసింది. అరవయి అయిదు రూపాయలు పోగు అయింది. సుమిత్ర సంతోషం అవధుల్లేనిదయింది అంటే ఒక సంవత్సరంలో తను నూటపదిహేను రూపాయలు పోగు చేసిందన్న మాట! పోనీలే ఈ సారన్నా తను ఒక పట్టు పరికిణీ కొనాలి సీతకు, అని నిశ్చయించుకుంది. సంతోషంగా గాజులు, పూసలు అన్నీ సర్దుకుంది. గబగబా వెళ్ళి తలుపు తీసింది. శివరావు వచ్చేడు. "ఏం చేస్తున్నావు? ఎంతకీ తలుపు తీయవేమిటి!" అన్నాడు.

"పెట్టె సర్దుకుంటున్నాను" అంది.

"ఏమున్నాయి సర్దుకుంటానికి" అన్నాడు చొక్కా విప్పి హేంగర్‌కి తగిలిస్తూ నవ్వి. ఆ నవ్వు చాలా జాలిగా వుంది.

"అవే. బట్టలు బాగా సర్దుకుంటున్నాను. పిల్లలతో ఎప్పటికప్పుడే హడావిడి. అయిపోతోంది" అంది.

"సుమిత్రా! నీవుకనుక నాతో సర్దుకుపోతున్నావు. అదే మరొకరయితే నాకు ఇంత సుఖంగా, శాంతంగా నా సంసారం జరిగేదికాదేమో అనిపిస్తూ వుంటుంది. ఈ పదేళ్ళ సంసారంలో మనం ఒక్క కానీ అయినా నిలవచేయలేకపోయేము. ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు చేయాలి. బాజీకి కనీసం బి.ఏ. వరకూ చదువయినా చెప్పించాలి. ఎల్లాగ! అని తల్చుకుంటూ వుంటే భయంగా వుంటుంది. సుమిత్రా!" అన్నాడు.

"అన్నిటికీ భగవంతుడే వున్నాడు. పిల్లలింకా చిన్నవాళ్ళు కదా!" అంది.

"భగవంతుడు డబ్బు చేరవేసే నేర్పు కొందరికే ఇస్తాడు, కొందరి కివ్వడు. మనిద్దరి వద్దాకూడా డబ్బు దాచే నేర్పు లేదు" అన్నాడు. నోటి చివరివరకూ వచ్చింది, తనూ కొంచెం కొంచెం దాస్తున్నానని చెప్పుదామని. కాని తమాయించు



ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★ 100% పాలియస్టర్ చీరలు
★ ఫుల్‌వాయిల్, ఆఫ్ వాయిల్ చీరలు
★ షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★ డ్రస్ మెటీరియల్సు, 2×2 రూబియాలాన్సు
★ స్కూలు యూనిఫారంలు ... వగైరాలకు
విజయ షోరూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు
గవర్నరుపేట ... విజయవాడ - 2

వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్రజ్యోతి"
దినపత్రికనే చదవండి




గల్ఫ్ దేశాలలో
ఉద్యోగావకాశాలు
మిడిల్ ఈస్ట్ దేశాలలో డైరెక్టు ఉద్యోగాలు పొందేందుకు ఉచిత సాహిత్యం, మరియు గైడెన్సు కొరకు వ్రాయండి. స్వంత చిరునామా కలిగిన స్టాంపు అంటించిన కవరు పంపండి.
Globe Service Information Centre (Regd.) (AV-3)
WZ-69, Nangli Jalib
New Delhi-110058.

కుంది ఇంకా చాలా పోగుచేసేక ఒక్కసారి చూపించి అతన్ని ఆశ్చర్యపరచాలి అనుకుంది. పిల్లలు వచ్చేరు. అంతా సందడి వంటా వడ్డనా అన్నీ అయితం(డి. పిల్లలూ భోజనాలు చేసేవరకూ ఒకటే తొందరపడిపోతారు. ఆరాత్రి అనుకుంది ఇంక పట్టుపరికిణీ కొనవద్దు. పిల్లలకి కొన్నా ఎల్లాగూ కట్టటానికి వుండదు. వాళ్ళకి స్కూల్ డ్రస్సులే చాల్ను. ఆదివారాలూ. సెలవురోజులకీ ఏవో సాదాగుడ్డలు కుట్టించితే చాల్ను. అంతకన్నా తనూ సావిత్రి పిల్లలకిలాగ వాళ్ళకాళ్ళకి వెండి పాంజేబులు కొనాలి అనుకుంది. క్రమక్రమంగా సందుకాపెట్టె అర్ధరూపాయి కాసులతోటీ పావలా కాసులతోటీ నిండుతోంది. ఒకరోజు వెండి వస్తువులు చేసే కంసాలి ప్రక్కయింటికి వచ్చేడు. అతన్ని పిలిచింది

"వెండి తులం ఇరవయి రూపాయలు అమ్మగారూ!" అన్నాడు సుమిత్ర వాకబు చేసేను.

"అయితే నిండా మూడు తులాల వెండి కూడా రాదు. అయిదారు తులాలు లేందే కాళ్ళకి పాంజేబులు ఏమి బాగుంటాయి? పెద్దయినా పెట్టుకుందుకు వీలుగా వుండాలి." అనుకుంది. ఒకరోజు ఆదరా బాదరా ఆఫీసు నించి ఇంటికి వచ్చేడు శివరావు. ముఖం గాభరాగా వుంది. కాఫీ ఇచ్చేక "ఏమిటంత అందోళనగా వున్నారు!" అంది. "నా ఖర్మ! ఒక ఫ్రెండ్ మన ప్రక్క ఇంటి సుబ్బారావుకి వందరూపాయలు ఇవ్వాలసి వున్నదట. ఆ వంద రూపాయల నోటు నిన్న అతను వూరికి వెళుతూ నాకు ఇచ్చేడు. చొక్కా జేబులో పెట్టుకున్నాను. ఇవ్వాళ ఇచ్చేద్దామనుకున్నాను. రాత్రి నీతో చెప్పనేలేదు. ఇవ్వాళ పరధ్యానంగా ఆఫీసుకి వెళ్ళిపోయేను. అక్కడికి వెళ్ళేక చూసుకుంటే ఆ వంద రూపాయల నోటు కాదుకదా నా డబ్బు పదిహేను రూపాయలు కూడా పోయేయి. ఎవడో చుప్తాగా జేబు కొట్టేశాడు. నెలాఖరు రోజులు. సుబ్బారావుకి ఎల్లా సర్దుతాను? ఒకవేళ నెల జీతంలో ఇచ్చినా వంద రూపాయల లోటుని ఎలా పూడ్చుకొంటాం!" అన్నాడు. సుమిత్ర భర్తకు వచ్చిన ఈ విపత్తుకు విలవిలలాడిపోయింది. ఇంక భర్తకు తను డబ్బు దాచుతుందన్న విషయం దాచవలసిన అగత్యం కనపడలేదామెకు. భోజనాలు అయినాక పిల్లలు నిద్రపోయినాక నవ్వారు పట్టె మంచం మీద కూర్చుని సందుకాపెట్టె దిమ్మరించింది. మడత

## ఊపిరి పసిపాప

నిశ్శబ్దం నుదుటిపై
మూగరాగాలుగా కరిగిపోతున్న
రంగుల మాయలో
పడవ ప్రమిదలో తెరచాప దీపం....
చీకటి పొలాల్లో
వెలుగులు విత్తిన ఒక చిలుక
శ్రమా తపస్సులో
ఆకుపచ్చను సన్యసించి
కాషాయ కాంతిలో
తన ఆత్మ ప్రపంచానికి తిరిగిపోతోంది
ఆ కర్మయోగి త్యాగానికి
మూగవోయిన నరాల చెట్టు నిలువునా
శిలలైనయ్....
ఎక్కడో ఊగుతోంది
ఊపిరి పసిపాప గుండె జోలలో....
రాళ్ళపై రాగాలు గూళ్ళు కట్టుకుంటు
న్నాయ్....
స్వరాల తీగలతో.... శృతుల పువ్వు
లతో....
మెరిసే ఈ నది వలలో
చిక్కుకున్నాయ్ నా చూపుల
పక్షులు....
పాటనై కరిగిపోతున్న నాకు
ఈ అనంతం చాలా ఇరుకుగా వుంది.
అందుకే ఎగిరొస్తున్నా....
మీ కళ్ళ లోయల్లోంచి
హృదయాల ఆరామాలకు.

—పంల్లెల

మంచం మీద ఓరగిల పడుకున్న శివరావు గలగలమన్న చప్పుడుకు లేచి నడుంగా కూర్చున్నాడు.

"ఇదుగో యిల్లా రండి!" అంది సుమిత్ర. వచ్చి సుమిత్ర ప్రక్కగా కూర్చున్నాడు.

"ఇవన్నీ గబగబా లెఖ్ఖ పెట్టండి" అంది. అన్నీ యిద్దరూ లెఖ్ఖ పెటారు. సూటనలభయి నాలుగు రూపాయలున్నాయి.

"ఇవన్నీ ఎందుకు దాచావు సుమీ!"

అన్నాడు అతను ఆశ్చర్యపోయి అన్నీ చిల్లర డబ్బులే! చిల్లర శ్రీ మహాలక్ష్మి అంటారు. ఎన్నిరోజులు ఎంత కష్టపడి ఆ డబ్బులు దాచుకుందో. ఆ సమయంలో సుమిత్రకు తన కూతుళ్ళు సీత, గీతలకీ పెద్ద తేడా కనపడలేదు అతనికి.

"ఎందుకన్నా వుంటాయి అని పావలాలు, అర్ధరూపాయిలూ అందులో పడవేస్తూ వచ్చేను. పెళ్ళయిన కొత్తలో మీరే అన్నారుగా! అందులో డబ్బులు దాచుకోమనీ! అందుకని అల్లా దాచుతూ వచ్చేను" అంది స్నిగ్ధంగా. శివరావుకి జాలివేసింది. సుమిత్ర ముగ్గురు పిల్లల తల్లి అయింది. ఈ పదేళ్ళల్లో ఆవిడ తన తాహతుకు మించిన కోరిక కోరి తనని కించపరచలేదు. 'బాజీ' పుట్టుకకు జబ్బుపడింది. మూడో పురుడని ఆమెని తనతల్లి పట్టింటికి వెళ్ళనివ్వలేదు. సుమిత్ర తలి,వదన గారూ తోడు వచ్చేరు తన తల్లికి. దానా దీనా తనకు ఖర్చు తడిసి మోపెడు అయింది. మగపిల్లవాడు పుట్టేడని తల్లీ, అత్తగారూ బాలసారె ఘనంగా చేయించారు. శాంతి వుంచన్నారు అనన్నారు, ఇదన్నారు. దానా దీనా సుమిత్రకు వున్న ఒకే ఒక విలువయిన వస్తువు.రెండు నవరసుల బంగారు గాజుల జత చెల్లిపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు తానుమళ్ళీ ఆ గాజుల జత అమర్చలేకపోయేడు. కళ్ళమ్మట నీళ్ళు వచ్చేయి. "సుమీ! ఎన్నాళ్ళు దాచావో ఇంత చిల్లర! చేతిలో వుంటే నీకు ఒక పండు కొనాలనీ, ఒక సినిమా చూడాలనీ అనిపించలేదా! నీవు ఎంతో ఓర్పుతో దాచిన డబ్బుని నేను అశ్రద్ధగా పారవేసిన డబ్బుకి బదులు వాడుకున్నా! నా మనస్సు అంగీకరించదు. సుమీ! దాచుకో! నీవు ఎందుకు దాచుకున్నావో దానికే వినియోగించు సుమీ! నన్ను మరీ కృతజ్ఞతా బద్ధుడిని చేయకు."

"అదేమిటండీ ఈ డబ్బు లేమన్నా మా తాతగారి మూటనుకున్నారా! మీరు జేబులోనూ, డ్రాయరు సొరుగులోనూ అప్పుడప్పుడు పడవేసిన డబ్బులే! తీసి వేరేగా దాస్తూ వచ్చేను. మీ అవసరాని- ఉపయోగించుకోండి. తప్పేమిటి " అంది.

"నువ్వు దేనికోసం దాచావో, ముందు చెప్పు!" అన్నాడు. "ఎదురింటిసావిత్రిగారు. అస్తమానూ వాకిట్లోకి వచ్చిన ప్రతి బట్టలు అమ్మేవాడినీ పిలుస్తూ వుంటారు. వాళ్ళ పిల్లలకి కాళ్ళకు పాంజేబులు, మువ్వలు చేయించారు. ఎలా చేయించారండీ అని అడిగాను నేను దాచిన డబ్బుతో చేయించాను అన్నారు. మన పిల్లలకి అలా అమర్చాలని తహతహలాడేను. ముందు పట్టు వరికిణీ కుట్టించి ఈ పిల్ల సమర్థురాలే అనిపించుకోవాలనుకున్నాను. కాని ఒకసారి యాభయి రూపాయలు కూడవేసేసరికి మీ చెల్లాయి వచ్చేరు. బహుశా మీకు కూడా జ్ఞాపకం వుండే వుంటుంది. అస్తమానూ చిల్లర డబ్బులు వర్షంలా కురిపించేస్తున్నానని మీ చెల్లాయిహాస్యమాడేది. మీరూ నవ్వేవారు.

తరువాత మళ్ళీ చిల్లర డబ్బులన్నీ సందుకా పెట్టెలో వేయటం మొదలు పెట్టాను. సీతకు వెండి పాంజేబులు చేయించుదామనుకున్నాను. కాని తులం ఇరవయి రూపాయలు అయిందన్నారు. ఇంక మూడుతులాలకీ రెండు తులాలకీ ఏమి చేయించుతానని వూరుకున్నాను.కాని అందులో చిల్లర మటుకు పడవేయడం మానివేయలేదు. అల్లా పోగయింది. ఒక సంవత్సరములో నేను రెండువందల రూపాయలదాకా పోగుచేసే నన్నమాట!" అంది సుమిత్ర. శివరావు సుమిత్రను మెచ్చుకున్నాడు. నీలాంటి భార్య దొరకటం తన అదృష్టం అన్నాడు. ఆ రాత్రి చాలా సంతోషంగా వాళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ గడిపేరు. మర్నాడు సుబ్బారావు వందరూపాయలూ ఇచ్చేడు శివరావుకి.

"ఇదేమిటోయ్ ఇంత చిల్లర ఇచ్చేవూ!" అన్నాడు సుబ్బారావు.

"మా ఆవిడ చిల్లర ఇరువది నోటు తీసుకుని చిల్లర ఇచ్చింది" అన్నాడు.

"అయితే మీ ఆవిడదగ్గర ఎప్పుడూ వందనోటుకి చిల్లర వుంటుందన్నమాట! వెరీగుడ్!" అన్నాడు. గర్వంగా నవ్వేడు శివరావు. జీతం రాగానే వందరూపాయలు తెచ్చి సందుకాపెట్టెలో వేసేశాడు శివరావు. అది సుమిత్ర గమనించనేలేదు. శివరావు కూడా అప్పుడప్పుడు జేబులో చిల్లర మిగిలితే సందుకాపెట్టెలోపడవేస్తూవుండేవాడు. చివరికి కొన్నాళ్ళకి ఈ చిల్లర డబ్బులు సందుకాపెట్టెలో పట్టటం మానేశాయి. నిండిపోయింది పెట్టె పూర్తిగా అనుకున్నాక ఒక రోజు భర్తని పెందరాళే ఆఫీసు నుంచిఇంటికి రమ్మంది. అతను వచ్చేక



ఇద్దరూ తలుపులు బిగించుకుని పెట్టె ముందర కూర్చున్నారు. చిల్లర అంతా అయిదు వందలకు పైగా అయింది. ఇద్దరూ ఆశ్చర్యపోయేరు. నిజంగా ఇంత డబ్బు ఒక్క నెలజీతంలో తాము సేవ్ చేయగలిగారంటే నమ్మశక్యం కాదు.

"సుమీ్మ! ఈ పని నువ్వు ముందునించీ చేస్తే ఈ సరికి మనము బోలెడు డబ్బు పోగుజేసుకుందుము. ఒక సంవత్సరంలో మనం ఏడెనిమిది వందలు సేవ్ చేయగలిగామంటే మనం పదేళ్ళల్లో అయిదారు వేల రూపాయలన్నా సేవ్ చేయగలిగి వుండేవాళ్ళం. మన సంపాదన పరిధి చాలా చిన్నది. అందులోనూ పురుడు కూడా నేనే పోయాల్సి వచ్చేది. ఎప్పటికప్పుడే అనుకునే వాడిని నెలకి యాభయి రూపాయలయినా వేరే దాచాలని. ఆసరికి ఏవేవో తప్పనిసరి ఖర్చులు వచ్చి అయిపోయేవి" అన్నాడు. "నేనూ యింత మొత్తం దాచగలుగుతా ననుకోలేదు" అంది సుమిత్ర సంబరంగా. శివరావు ఆ రోజే బాంక్‌కి వెళ్ళాడు. చిన్న సేవింగ్స్ ఎకవుంట్ తెరిచాడు. రోజులు, నెలలు గడుస్తున్నాయి. పండుగలు పబ్బాలు వస్తున్నాయి. కాని సుమిత్ర సందుకాపెట్టె మాత్రం తెరవటంలేదు. అందులోకి చిల్లరడబ్బులు పడవేయటం మానలేదు. సంవత్సరానికో, ఆర్నెల్లకో భార్యాభర్తలిద్దరూ చిల్లర అంతా లెఖ్ఖపెట్టుకోవటం, ఆ మొత్తాన్ని బాంక్‌లో వేయటం. సీత, గీత, బాజి పెద్దవాళ్ళయ్యారు. సీత బి. ఇడి. ట్రయినింగ్ అయింది. గీత పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసింది. బాజి ఇంటర్‌లోకి వచ్చేడు ముగ్గురూ ఒకరోజు సీత స్నేహితురాలింటికి పార్టీకి వెళ్ళారు. ఎండలో మధ్యాహ్నం ఇంటికి వచ్చేడు శివరావు. అప్పుడే సందుకాపెట్టె నవ్వారు పక్కై మంచం మీద బోర్లించి చిల్లర లెఖ్ఖ పెట్టటం మొదలుపెట్టింది సుమిత్ర. టక్ టక్ టక్ టక్ మంటూ తలుపు చప్పుడయ్యేసరికి పిల్లలు వచ్చేశారేమో అని భయపడింది. ఇన్ని సంవత్సరాలూ పిల్లలకి తన దాపరికం తెలియకుండానే గడుపుకు వచ్చింది. ఇంత పెద్ద వాళ్ళయినాక తల్లి ఎవ్వరికీ తెలియకుండా చాలా చిన్నదయిన సందుకాపెట్టెలో చిల్లర డబ్బులు దాచుకుంటుందంటే పిల్లలు వేళాకోళం చేస్తారేమో అని సిగ్గు. గబగబా ఆ చిల్లర డబ్బుల పోగుమీద దుప్పటిలాగి వెళ్ళి తలుపు తీసింది. భర్త శివరావు వీధి గుమ్మంలోనే సుమిత్రను యెత్తిపట్టుకుని గిరిగిరా త్రిప్పాడు. గట్టిగా కౌగలించుకుని మెడమీదా చెంపలమీదా ముద్దులవర్షం కురిపించేడు.

"అయ్యయ్యో! ఏమిటండీ ఇది! ఎవరన్నా చూస్తారు. చిన్న పిల్లవాడిలా యింత సంబరపడిపోతున్నారు. ఏమి జరిగింది! చెప్పండి" అంటూ గిజగిజలాడింది.

"సుమీ్మ! నా అంత అదృష్టవంతుడు లేడు అనుకో. ఇవ్వాళ లేవగానే నీ ముఖమే చూసివుంటాను. సెక్షన్ హెడ్‌గా ప్రమోషన్ వచ్చింది. ఎనిమిదివందల రూపాయలు జీతం వస్తుంది. మన సీతకు గరల్స్ హైస్కూల్‌లో టీచర్‌గా ఎపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది. అన్నట్లు సుమీ్మ నీవు ఏంచేస్తున్నావు పిల్లలంతా ఏరీ!" అన్నాడు అప్పుడే గుర్తుకి వచ్చినవాడిలా!

"పిల్లలు సీతావాళ్ళ స్నేహితురాలింటికి పార్టీకి వెళ్ళారు"

"మరి నువ్వు! నువ్వేం చేస్తున్నావు?" అన్నాడు.

"మన పనే చేస్తున్నాను" అంది నవ్వుతూ

"మన పనేమిటి!" అన్నాడు.

"అదే! సందుకాపెట్టె తెరిచి చిల్లర అంతా పోగుచేసింది లెఖ్ఖపెడ్తున్నాను."

"ఇంక మనకా అవసరం లేదు సుమీ్మ! నేను ఆర్జిస్తున్నాను. సీత జీతం సీతకు బాంక్‌లో వేద్దాము. దాని పెళ్ళి ఖర్చులకు ఉపయోగపడుతుంది. గీతకు కూడా త్వరలోనే ఉద్యోగం వచ్చేస్తుంది. పిల్లలిద్దరూ ఆర్జనపరులయితే మనం సందుకాపెట్టెలో చిల్లర దాచనవసరం లేదు. నీవు ఇంక శ్రమపడ నక్కరలేదు." అన్నాడు సుమిత్ర నవ్వేసింది. చాలా రోజులు సందుకాపెట్టె తెరవనే తెరవలేదు. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. పెళ్ళిళ్ళు, పేరంటాలు సక్రమంగా జరిపారు బాజీ. ఉద్యోగస్తుడయినాడు. కోడలు పిల్ల కాపరానికి వచ్చింది. ఒకరోజు ఆ పిల్లకి అత్తగారు గదిలో కూర్చుని తలుపులు బిగించుకుని ఏమి చేస్తుందాఅని అనుమానం వచ్చింది. తలుపుల కంతలోనించి చూసింది. మంచంనిండా నాణేలు. పావలాలు, పది పైసలు, అర్ధరూపాయి కాసులు కళ్ళు చెదిరాయి. ఆ రాత్రి భర్త దగ్గర చేరింది. నూతన వధువు అయిన వసంతలో ఆరాటం ఎక్కువ.

"చూడండి!" అంది భర్తని బిగి కౌగిలిలో ఉక్కిరి బిక్కిరి చేస్తూనూ.

"ఏమిటీ?" అన్నాడు నిలువునా కరిగిపోతూ.

"మీ అమ్మగారు చాలా తెలివయిన మనిషండీ" అంది. "ఓసి నీ ఇల్లు బంగారంగానూ! నిన్నగాక మొన్న వచ్చేవో, లేదో అప్పుడే అత్తగారి తెలివిని వేటకుక్కలా పసికట్టేశావా!" అనుకున్నాడు.

"ఏమిటలా అన్నావు?"



"చిల్లర డబ్బులన్నీ దాచేసుకుంటోంది" అన్నది. వసంతని దూరంగా తోశాడు.

"ఏమిటా వాగుడు?" అన్నాడు విరాగా. వసంతకు కోపం వచ్చింది. నిన్నటి దాకా నీవే నా జీవనజ్యోతివి. కాంతివి. శాంతివి. అన్నవాడు ఇప్పుడు హఠాత్తుగా అంత విసుగ్గా. కోపంగా అనేసరికి ఉక్రోషం ముంచుకు వచ్చింది.

"నా ది వాగుడులానే కనపడుతుంది మీకు. ఒక్కసారి ఆవిడ పెట్టె తెరిచి చూడండి. ఎంత చిల్లర కనపడుతుందో! ఆవిడ కనపడ్డ చిల్లరంతా దాచేస్తూ వుంటే చిల్లర ఖర్చులకి డబ్బు ఎలా వస్తుంది! చెప్పండి!"

"నీ ముఖం! అమ్మ వేరే దాచుకోవట మేమిటి!

ఆవిడ ఏం చేసుకుంటుంది డబ్బు!" అన్నాడు.

"ఏంచేసుకుంటారు. కూతుళ్ళకిస్తారు" అంది సాధింపుగా.

"కూతుళ్ళకివ్వాల్సిన ఖర్మ ఆవిడకేమీ లేదు. మా అక్కయ్యలు పుట్టింటిసొమ్ముకి ఆశపడరు. వాళ్ళిద్దరూ ఉద్యోగాలు చేసు కుంటున్నారు."

"చేసుకుంటేమటుకు! తల్లికి ఎప్పుడూ కూతుళ్ళకి పెట్టాలనే వుంటుంది" అంది. ఒకరోజు తల్లి కోవెలకి వెళ్ళినప్పుడు సందుకాపెట్టె తెరచి చూసేడు బాజీ. వసంత చెప్పింది నిజమే అయింది పెట్టినిండా డబ్బులే! అమ్మ ఏంచేసు కుంటుంది ఇన్ని చిల్లర నాణేలు! అను కున్నాడు. తల్లి రాగానే అడిగాడు. "అమ్మా సందుకాపెట్టెలో డబ్బులు దాచు కుంటున్నావా! నీకు చిల్లర యెప్పుడు దేనికి కావాల్సినా నేను యిస్తాను. నాన్న గారు యిస్తారు. ఇంకా యెందుకు ఆ దాపరికం" అన్నాడు. శివరావు కూడా అక్కడే వున్నాడు. తల్లిని కొడుకు అడిగిన ప్రశ్నకు శివరావు జవాబు చెప్పాడు.

"మీ అమ్మకి ఆ పెట్టె అంటే ప్రాణంరా! చిన్నప్పుడు వాళ్ళ బామ్మ దానిలో బంగారం కాసులు కొనుక్కొని దాచేవారట. నేను వేళాకోళంగా నీవు డబ్బులు యేమయినా దాచుకో అన్నాను. అప్పటినించీ దానిలో చిల్లర డబ్బులు దాచుకుంటూ వచ్చింది. ఆ పెట్టెలో పోగు చేసిన డబ్బులతోటే నేను ఎన్నెన్నో ఒడి దుడుకులను ఎదుర్కొన్నాను. నిన్నూ, అక్కయ్యలనీ చదివించగలిగాను. చిల్లర నాణేలు పోగుచేసినా ఆ సొమ్ము ఎన్నెన్నో పెద్ద పెద్ద ఖర్చులకిసరిపోయేది" అన్నాడు.

"నువ్వెప్పుడు చూసేవురా!" అంది సుమిత్ర.

"అవునూ, అసలు నీకు ఎలాతెలిసింది ఆ పెట్టెలో చిల్లర డబ్బులుంటాయని!" అన్నాడు శివరావు. వసంత ముఖం తెల్ల బోయింది. కొత్తకోడలు- భర్త ఇంత సూటిగా తన తల్లిదండ్రుడు లని తన ముందరే అడిగేస్తాడని వూహించ లేదు. బిక్కగా చూస్తున్న వసంతను చూస్తే శివరావుకీ, సుమిత్రకీ సంగతి అర్థమయిపోయింది. "పోనీలే, ఎల్లాగోఅల్లా తెలిసింది. ఇంక ఆ పెట్టితో నాకు పనిలేదు. వసంతా ఆ చిల్లర అంతా మొన్న లెక్క పెట్టాను. నాలుగు వందల యాభయి రూపాయలు అయినాయి. కాళ్ళకి సన్నటి వెండి పాంజేబులు వస్తాయి. కొనుక్కో! ఆ పెట్టె నీవు తీసుకో! అచ్చి వచ్చిన పెట్టె! ఒకటి అరా డబ్బులు వేస్తూ వుండు. నీ అవస రాన్ని అది ఆదుకుంటుంది" అంది సుమిత్ర.

"క్షమించండి అత్తయ్యా. మీరు చిల్లర దాచుకుంటున్నారని నేనే మీ అబ్బాయితో చెప్పాను" అంది బేలగా.

"చెప్పానుగా దాచుకోవటం అనేది ఒకళ్ళని వేరుచేయటానికి కాదు. ఒకళ్ళ అవసరానికి ఆదుకోవటానికి. ఇందులో తప్పేమీలేదు వసంతా! ఇది నేరంగా అను కోవటమే తప్పు. మానాయనమ్మ బంగారం కాసులు దాచినదాంట్లో నేను చిల్లర నాణేలు మాత్రమే దాచ కలిగినా నా సంసారం యెంతో అభివృద్ధికి వచ్చింది. అలానే మీ సంసారం అభివృద్ధిలోకి రావాలి. ఈ పెట్టె నీకు నా వారసత్వంగా యిస్తున్నాను దాచుకో!" అంది సుమిత్ర. శివరావు నవ్వుకున్నాడు. సుమిత్ర తెలివి తేటలకి గర్వంకూడా కలిగింది అతనికి.

"పెట్టె కోడలుకి యిచ్చేశావు. మరి నువ్వు యింక దేనిలో డబ్బులు దాస్తావు!" అడిగాడు. భార్యని వంటరిగా వున్నప్పుడు

"పెట్టె ఆ పిల్ల వద్దనే వుంటే నేను వాళ్ళని కాదని డబ్బులు దాచుకుంటున్నా ననే అనుమానం రాదు పిల్లకి. ఇద్దరం ఆడవాళ్ళం కలిసి ఒక ఇంటిలో మసలా లంటె ఒకళ్ళ మీద ఒకళ్ళకి నమ్మకం అవసరం! ఏమంటారు?" అంది సుమిత్ర.

"నిజమే!" అన్నాడు శివరావు.

